


చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం 36.7°/14.2°

జిల్లా అంతటా శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గడంతో వేకువజామున కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కనిపించింది.

న్యూస్‌రీల్

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

పెద్దపప్పూరు: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. రెండు రోజుల క్రితం పెద్దపప్పూరు తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఇసుక రీచ్ వద్ద జేసీ ప్రభాకర్‌రెడ్డి హల్‌చల్ చేశారు. రీచ్‌లో పనిచేస్తున్న వీరాంజనేయులు అనే దళితుడిని కులం పేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన అనచరులైన మరో 15 మందిపై వివిధ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ శనివారం మీడియాకు తెలిపారు.

మంత్రి ఉషశ్రీచరణ్ కాన్వాయ్‌కి ప్రమాదం

- పెనుకొండ సమీపంలో లారీని ఢీ కొన్న ఎస్కార్టు వాహనం



ప్రమాదంలో దెబ్బతిన్న ఎస్కార్ట్ వాహనం

పెనుకొండ రూరల్: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ కాన్వాయ్‌లోని ఓ వాహనానికి ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు... మంత్రి ఉషశ్రీ చరణ్ శనివారం అనంతపురం నుంచి బెంగళూరు వైపు వెళ్తున్నారు. ఆమె కాన్వాయ్‌లో ముందు వెళ్తున్న ఎస్కార్ట్ వాహనం పెనుకొండ జాతీయ రహదారిపై పుట్టపర్తి జంక్షన్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీ కొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినింది. అయితే ఎవరికీ ఇబ్బందులు కలగలేదు. దీంతో కాన్వాయ్ ముందుకు సాగిపోయింది. ఈ ఘటనపై 'కియా' ఎస్‌ఐ వెంకటరమణను వివరణ కోరగా, తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

30 వేల కేసులకు పరిష్కారం

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28 బెంచ్‌లతో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 30,009 కేసులకు పరిష్కారం చూపినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. శ్రీనివాస్, కార్యదర్శి గరికపాటి దీనబాబు తెలిపారు. ఇందులో 7,762 క్రిమినల్ కేసులు, 71 సివిల్ కేసులు, 22,099 ప్రిలిటిగేషన్ కేసులు, 77 మోటారు వాహన ప్రమాద కేసులు ఉన్నాయి. ప్రమాద భరిత కేసుల్లో బాధితులకు రూ.5,90,41,658 పరిహారం చెల్లించేందుకు ప్రతివాదులు రాజీ పడి ముందుకు వచ్చారు. అలాగే సివిల్ కేసుల్లో రూ.69.16 లక్షలు, ప్రిలిటిగేషన్ కేసుల్లో రూ.1,87,50,855ను పరిహారం చెల్లించేందుకు ప్రతివాదులు ముందుకు వచ్చారు.

ప్రకృతి ధామం పరివర్తన క్షేత్రం

SUNDAY SPECIAL



ఖైదీలు సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయల పంటలు

అక్కడికి అడుగుపెట్టగానే పచ్చనిచెట్లు స్వాగతం పలుకుతాయి. ప్రకృతి రమణీయత ఆహ్లాదాన్ని పంచుతుంది. పాడిపంటలు కనువిందు చేస్తాయి. జీవవైవిధ్యం ముచ్చటగొలుపుతుంది. ఒకసారి ప్రవేశిస్తే ఎంతసేపైనా అక్కడే ఉండిపోవాలనిపిస్తుంది. అలాగని అదేమీ అందమైన అటవీ ప్రాంతం కాదు. జనారణ్యం నడుమ ఉన్న ఓ జైలు. వినడానికి వింతగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ నిజం. అదే రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు (ఖైదీల వ్యవసాయ క్షేత్రం). ఖైదీల పరివర్తన కేంద్రంగా, అందమైన వ్యవసాయ క్షేత్రంగా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.



ఓపెన్ ఎయిర్ జైలులోని మిరప తోటలో పనిచేస్తున్న ఖైదీలు

- ప్రత్యేకతను చాటుకుంటున్న రెడ్డిపల్లి ఓపెన్‌ఎయిర్ జైలు
- పాడిపంటలు, ప్రకృతి రమణీయతకు నిలయం
- జీవవైవిధ్యానికీ ఆలవాలం
- ఖైదీల సమగ్ర పరివర్తనకు దోహదం



కూరగాయలు విక్రయిస్తున్న ఖైదీ

అనంతపురం డెస్క్:

క్షణికావేశంలో చేసిన నేరాలు జైలుగోడల మధ్యకు నెడతాయి. సుదీర్ఘకాలం అక్కడే ఉండిపోవాల్సి వస్తే జీవితమే నరకంగా మారుతుంది. తప్పు చేస్తే శిక్ష అనుభవించాలి కానీ అది పరివర్తనకు దోహదపడినప్పుడే అర్థవంతమవుతుంది. ఖైదీల్లో పరివర్తన, చట్టాలను గౌరవించే పౌరులుగా తీర్చిదిద్దడం, పునరావాసానికి దోహదపడాలనే ఉద్దేశంతో ఓపెన్ ఎయిర్‌జైలు వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద ఓపెన్ ఎయిర్ జైలును 1965 సంవత్సరంలో అప్పటి కేంద్రమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. అనంతపురం నగరానికి అత్యంత చేరువలో ఉండే ఈ జైలును మొదట్లో 1,427.57 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. తర్వాత క్రమంలో జిల్లా జైలు, ఏపీఎస్‌పీ బెటాలియన్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి 623.44 ఎకరాలను కేటాయించారు. దీంతో ప్రస్తుతం 804.13 ఎకరాల్లో ఓపెన్ ఎయిర్‌జైలు కొనసాగుతోంది.

స్వేచ్ఛా జీవితం.. నైపుణ్య శిక్షణ..

సాధారణ జైల్లో శిక్ష అనుభవించే సమయంలో క్రమశిక్షణతో మెలిగి, పరివర్తన చెందేవారిని చివరిదశలో రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్‌జైలుకు పంపుతారు. ఇక్కడి స్వేచ్ఛా వాతావరణంలో ఖైదీల్లో ఒత్తిడి తగ్గించి.. వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు సమగ్ర వికాసానికి దోహదం చేస్తున్నారు. వారు విడుదలైన తర్వాత సమాజంలో సాఫీగా బతకడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. వాస్తవానికి ఈ జైలును 300 మంది ఖైదీల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. అయితే..జిల్లా జైళ్లలోనే సెమీ ఓపెన్‌ఎయిర్ సిస్టం తేవడం, నేరాల సంఖ్య తగ్గడం, ఇతరత్రా కారణాల వల్ల ప్రస్తుతం ఇక్కడ 32 మంది మాత్రమే ఉన్నారు.

పంటల సాగు.. పెట్రోల్ బంకుల నిర్వహణ..

రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్‌జైలు ఖైదీలు వ్యవసాయ, అనుబంధ విభాగాలతో పాటు పెట్రోల్ బంకుల నిర్వహణలోనూ సత్తా చాటుతున్నారు. దాదాపు అన్నిరకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వీటిని గతంలో ట్రాక్టరులో అనంతపురానికి తెచ్చి విక్రయించేవారు. ఇప్పుడు జైలు వద్దే అనంతపురం–తాడిపత్రి రహదారి పక్కన అమ్ముతున్నారు. తక్కువ పురుగు మందుల వాడకంతో నాణ్యమైన కూరగాయలు పండిస్తుండడంతో వీటి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మామిడి, సపోటా, ఉసిరి తదితర పండ్లతోటల సాగుతో పాటు డెయిరీ నిర్వహణ, గొర్రెలు, పశువుల పెంపకంలోనూ ఖైదీలు నైపుణ్యం సాధించారు. ఇక పెట్రోల్ బంకుల నిర్వహణలో విజయవంతంగా ముందుకు సాగుతున్నారు. ఇక్కడ రెండు పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ రూ.పది లక్షల దాకా వ్యాపారం చేస్తున్నారు.

ఓపెన్ ఎయిర్ జైలు స్వరూపమిదీ..	
మొత్తం విస్తీర్ణం (ఎకరాలు)	1,427.57
ప్రస్తుత విస్తీర్ణం (ఎకరాలు)	804.13
ఖైదీల సామర్థ్యం	300
ప్రస్తుతమున్న ఖైదీల సంఖ్య	32

ప్రకృతి రమణీయత.. జీవ వైవిధ్యం..

ఓపెన్ ఎయిర్‌జైలు ప్రకృతి రమణీయతకు నిలయంగా ఉంది. ఎటుచూసినా చెట్లు, పండ్ల తోటలు, పంటలతో అలరారుతోంది. వన్యప్రాణులకూ ఆశ్రయమిస్తోంది. పచ్చనిచెట్ల మధ్య నెమళ్లు, కుందేళ్లు, అడవి పందులు, ముంగిసలు తదితర వన్యప్రాణులు సందడి చేస్తున్నాయి. వీటిని ఖైదీలు, జైలు అధికారులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు, వైవిధ్యం కల్గివున్నందునే అది ఒక జైలన్న భావన కల్గదు. అక్కడున్న వారు ఖైదీలన్న విషయమూ మరచిపోతాము.

ఫొటోలు : జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్

సొంత పొలంలో పని చేస్తున్నట్టుంది



క్షణికావేశంలో చేసిన తప్పు వల్ల శిక్షఅనుభవిస్తున్నా. కానీ ఓపెన్ ఎయిర్ జైలుకు వచ్చిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. ఇక్కడ కూరగాయలు పండిస్తున్నా. సొంత పొలంలో పనిచేస్తున్నామన్న భావన కలుగుతోంది. ఇక్కడ పనిచేస్తున్నందున రోజుకు రూ.180 చొప్పున చెల్లిస్తున్నారు. ఇందులో సగం అవసరాలకు వాడుకోవచ్చు. మిగిలిన సగం బ్యాంకు ఖాతాలో జమ చేసి..విడుదలైన తర్వాత ఇస్తారు. – **లక్ష్మీనారాయణ**

బతకొచ్చన్న ధీమా వచ్చింది



తోటి ఖైదీలు పండించే కూరగాయలు, ఆకుకూరలను నేను ఇక్కడ విక్రయిస్తున్నా. నా పని రోజూ ఇదే. ఓపిక, సహనం పెంపొందాయి. ప్రజలతో ప్రవర్తించే తీరులోనూ మార్పు వచ్చింది. ఇక్కడ నేర్చుకున్న ఈ పనితో జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత కూడా ధైర్యంగా బతకొచ్చన్న ధీమా వచ్చింది. – **కృష్ణ**

పని బాగా నేర్చుకున్నా..



కడప సెంట్రల్ జైలులో కొంతకాలం శిక్ష అనుభవించిన తర్వాత ఇక్కడికొచ్చా. వాతావరణం చాలా బాగుంది. పెట్రోల్ బంకులో పంపు బాయ్‌గా పనిచేస్తున్నా. ఈ పనిలో నైపుణ్యం సాధించా. జైలు అధికారులు రోజుకు రూ.200 చొప్పున చెల్లిస్తున్నారు. – **అమరనాథ్‌రెడ్డి**

పరివర్తన, పునరావాసానికి కృషి



ఓపెన్‌ఎయిర్ జైలు లక్ష్యాలకు అనుగుణంగా ఖైదీల్లో సమగ్ర పరివర్తనకు కృషి చేస్తున్నాం. వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో నైపుణ్యాలు పెంపొందిస్తున్నాం. ఖైదీలు పంటల సాగు, పెట్రోల్ బంకుల నిర్వహణలో ప్రతిభ చూపుతున్నారు. పోటీపడి పంట దిగుబడులు సాధిస్తుండటం అభినందనీయం. మా క్షేత్రం నుంచి పెట్రోల్ బంకులు మినహా ఇతరత్రా ఆదాయ మార్గాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.60 లక్షలదాకా జమ చేస్తున్నాం. **–కె.చిన్నారావు, జైలు సూపరింటెండెంట్**

నెట్టికంటుడిని దర్శించుకున్న జస్టిస్ గంగారామ్



జస్టిస్ గంగారామ్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: హైకోర్టు జడ్జి ఎం.గంగారామ్ శనివారం గుంతకల్లు మండలంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో న్యాయమూర్తి కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు ఆయనకు స్వామివారి ఫొటో, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట గుంతకల్లు ఆర్డీవో రవీంద్ర, ఇతర అధికారులు ఉన్నారు.


జేసీ అనుచరుల బరితెగింపు

పెద్దపప్పూరు: వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. తాజాగా శుక్రవారం రాత్రి పెద్దపప్పూరు మండలం ధర్మాపురం, అమ్మలదిన్నె గ్రామాల్లోని జేసీ వర్గీయులు ఉదయభాస్కర్, జనార్దన్, జయచంద్ర, అమ్మలదిన్నె చంద్రశేఖరరెడ్డి తదితరులు అదే గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న శివయ్య, రామచంద్రారెడ్డిపై దాడి చేశారు. చిన్న పాటి సమస్యను సృష్టించి రెచ్చగొట్టి దాడులకు పాల్పడినట్లు బాధితులు వాపోయారు. ఈ మేరకు శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

బొమ్మనహళ్: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు. వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలికను శుక్రవారం అదే గ్రామానికే చెందిన డిగ్రీ విద్యార్థి తన ఇంట్లోకి పిలుచుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. రక్తస్రావంతో బాధపడుతున్న బాలిక తెలిపిన మేరకు యువకుడిపై పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం శనివారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

డీఈఓగా సాయిరాం



అనంతపురం: నూతన డీఈఓగా ఎం.సాయిరాం నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జవహర్‌లాల్ బాల్ భవన్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న ఎం.సాయిరాంను అనంతపురం డీఈఓ (పూర్తి అదనపు బాధ్యతలతో) నియమించారు.

ఆర్టీసీలో డీజిల్ మాఫియా

- నిబంధనలకు విరుద్ధంగా ఇంధనం కొనుగోలు
- సమీపం నుంచి కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సరఫరా
- అక్రమాలు గుర్తించి ట్యాంకర్‌ను సీజ్ చేసిన తహసీల్దార్
- వదిలి పెట్టాలంటూ అధికారులకు డీజిల్ వ్యాపారుల బెదిరింపు

గుంతకల్లు టౌన్: ఆర్టీసీలో డీజిల్ మాఫియా వెలుగు చూసింది. సమీపంలోనుంచి సరఫరా చేయాల్సిన ఇంధనాన్ని సుదూర ప్రాంతం నుంచి తీసుకొచ్చి డిపోకు చేరవేస్తున్నారు. మాఫియా నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి ఇంధనం సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. తమకందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు గుంతకల్లు డిపోకు అక్రమంగా డీజిల్‌ను తీసుకొచ్చిన ట్యాంకర్‌ను శనివారం సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు ఆర్టీసీ డిపోకు డీజిల్‌ను సరఫరా చేసే కాంట్రాక్ట్ గార్లదిన్నెలోని మణికంఠ ఐఓసీ అవుట్‌లెట్ నిర్వాహకులకు వచ్చింది. మార్కెట్‌లో రూ.99.20 ఉన్న డీజిల్‌ను రూ.96.75కే సరఫరా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే కర్ణాటక నుంచి డీజిల్ కొని.. ఆంధ్రాలో వే బిల్లు వేసి.. డిపోకు సరఫరా చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు శనివారం ఏపీ02.టీసీ.7778 నంబరు గల ట్యాంకర్ 12వేల లీటర్ల డీజిల్‌తో గుంతకల్లు డిపోకు వచ్చింది. అదే సమయంలో తహసీల్దార్ బి.రాము, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, రీసర్వే డీటీ ఆదినారాయణ, వీఆర్వోలు కృష్ణ, చిట్టి తదితరులతో కలిసి దాడులు నిర్వహించి పత్రాలు పరిశీలించారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని శ్రీషిర్డీసాయి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి డీజిల్‌ను తీసుకొచ్చినట్లు వేబిల్లులో ఉంది. అంతేకాదు గార్లదిన్నె ఐఓసీ ఔట్‌లెట్‌కు సంబంధించిన ఖాళీ లెటర్‌హెడ్, ఖాళీ రసీదు లభించాయి. 120 కిలోమీటర్ల రానుపోను దూరం ఉండే గార్లదిన్నెను కాదని 438 కిలోమీటర్ల రానుపోను దూరం ఉన్న ఔట్‌లెట్ నుంచి డీజిల్ ఎలా సరఫరా చేస్తారు? అంటే కర్ణాటకలో తీసుకొచ్చి.. ఆంధ్రాప్రాంతంలో కొన్నట్లు తప్పుడు వేబిల్లులు చూపి.. సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రాథమికంగా రెవెన్యూ అధికారులు నిర్ధారించి డీజిల్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని నివేదిక రూపంలో జాయింట్ కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.



సీజ్ చేసిన డీజిల్ ట్యాంకర్ వద్ద రెవెన్యూ అధికారులు



ఆర్టీసీ డిఎంతో వాగ్వాదానికి దిగిన తహసీల్దార్ రాము

ఆర్టీసీ డీఎంపై మండిపాటు

డీజిల్ సరఫరా ఏ అవుట్‌లెట్‌కు ఇచ్చారు.. సంబంధిత ఇండెంట్ కాపీలు చూపించాలని రెవెన్యూ అధికారులు ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) నారాయణస్వామిని కోరారు. దీంతో డీఎం ఆగ్రహంతో ఊగిపోయారు. మా అనుమతి లేకుండా ట్యాంకర్‌ను ఎలా పట్టుకుంటారు? మీకేం అధికారాలు ఉన్నాయంటూ వాగ్వాదానికి దిగారు. ఒక మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌తో ఎలా మాట్లాడాలో తెలీదా అంటూ డీఎంపై తహసీల్దార్ మండిపడ్డారు. అడిగిన పత్రాలు ఇవ్వకుండా, పొంతనలేని సమాధానాలు ఇవ్వడం, రెవెన్యూ అధికారులను లోనికి వెళ్లకుండా చుట్టుముట్టడాన్ని సీరియస్‌గా పరిగణించారు.

అధికారులకు బెదిరింపులు

తమ ట్యాంకర్‌ను ఎలా పట్టుకుంటారంటూ డీజిల్ వ్యాపారులు రమణ, హరి అధికారులతో గొడవ పెట్టుకున్నారు. ఆర్టీసీ డిపోలోకి వచ్చి ట్యాంకర్‌ను అడ్డుకునే అధికారం మీకెక్కడిది అంటూ రెచ్చిపోయారు. తాము టీడీపీకి చెందిన వాళ్లం కాబట్టి అధికారులు వేధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. సీఎస్‌డీటీ తరచూ తమ ట్యాంకర్‌ను పట్టుకుంటున్నారని, డబ్బు కోసం ఇలా చేస్తున్నారని ఆరోపణ చేశారు. అయితే సీఎస్‌డీటీ ఈ ఆరోపణలను కొట్టిపడేశారు. తాను నిక్కచ్చిగా విధులు నిర్వర్తించినందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు.

నేత్రపర్వం.. రథోత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని బూదిగుమ్మలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం వేలాది భక్తుల నడుమ నేత్రపర్వంగా సాగింది. నూతన రథానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి పూజలు నిర్వహించి, ఉత్సవాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో విశేష పూజలు, హోమాలు పెద్ద ఎత్తున జరిగాయి. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం గంగాహారతి, తిరునాల ఉంటుందని ఆలయ ఈఓ ఈశ్వరరెడ్డి, బూదిగుమ్మ ఆలయాల పాలక మండలి చైర్మన్లు ఈశ్వర రెడ్డి, ఈశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రామకృష్ణమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, ఎంపీటీసీ సభ్యుడు వీరబొమ్మన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీపీ వీరన్న, ఆలయ పాలక మండలి సభ్యులు జయన్నస్వామి, కేశవ రెడ్డి, గోవిందరెడ్డి, జయరామిరెడ్డి, రామసాగరం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు

ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఈ విద్యార్థి పేరు ఫణిరాజు. బొమ్మనహాళ్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి. తన గైడ్ టీచర్ కేఆర్ సునీతతో కలసి జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో పాల్గొని తన ఆవిష్కరణతో అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. మొక్కల పెంపకానికి వినియోగించే పాలిథిన్ కవర్ల వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం పొందిన ఫణిరాజు.. వ్యర్థంగా బయటపడేసే వేరుశనగ తుప్పతో చేసిన కుండీని ప్రదర్శించాడు. ఈ రకమైన కుండీల్లో నైట్రోజన్, ఫాస్ఫరస్, కాల్షియం వటి పోషకాలు ఉంటాయని, ఇది మొక్క ఎదుగుదలకు దోహదపడతాయని శాస్త్రీయంగా వివరించాడు. అంతేకాక భూమిలో కుండీ సులువుగా కరిగిపోవడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని నిరూపించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ... కేవలం ఒక్క ఫణిరాజే కాదు... జిల్లా వ్యాప్తంగా ఎందరో విద్యార్థులు తమ సృజనకు పదునుపెట్టి సృష్టించిన నూతన ఆవిష్కరణలను జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మొత్తం 122 ప్రాజెక్ట్‌లు ప్రదర్శించగా.. ఐదు విభాగాల్లో రెండు ప్రాజెక్ట్‌లు చొప్పున మొత్తం పదింటిని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు.



ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న బొమ్మనహాళ్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఫణిరాజు (చిత్రంలో) గైడ్ టీచర్ కేఆర్ సునీత

- ఆకట్టుకున్న జిల్లా స్థాయి సైన్స్ ఫేర్
- అబ్బుర పరిచిన విద్యార్థుల ఆవిష్కరణలు
- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 10 ప్రాజెక్ట్‌లు
- నూతన ఆవిష్కరణలతోనే దేశ పురోగతి : ఇన్‌చార్జ్ డీఈఓ

అనంతపురం: నూతన ఆవిష్కరణలతోనే దేశ పురోగతి సాధ్యమని అనంతపురం ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్య అన్నారు. అనంతపురం నగర శివారులోని పంగల్ రోడ్డులో ఉన్న రాప్తాడు ఏపీ మోడల్ స్కూల్ వేదికగా జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ శనివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక అంశాలపై విద్యార్థి దశ నుంచే ఆసక్తి కలిగిస్తూ వారి సృజనకు రూపం కల్పించినప్పుడే నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు. ఆ దిశగా సైన్స్ ఫెయిర్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విజ్ఞానశాస్త్రం, గణితం, పర్యావరణాన్ని ముడిసరుకులుగా వినియోగించి సృజనాత్మక ఆవిష్కరణలు తీసుకువచ్చేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఆవిష్కరణలు ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అనంతపురం డీవైఈఓ పద్మప్రియ, డీసీఈబీ సెక్రెటరీ లోకేశ్వరరెడ్డి, సైన్స్ క్యూరేటర్ బాలమురళీకృష్ణ, శ్రీసత్యసాయి జిల్లా సైన్స్ క్యూరేటర్ ఆనంద భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాన్ని పసిగట్టేలా..



మా గైడ్ టీచర్ గౌరీ ప్రవంచలి సాయంతో థండర్ బోల్ట్ అలర్టింగ్ యాప్‌ను రూపొందించాను. పిడుగు పడే 40 నిమిషాల ముందే ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశముంది. పిడుగుపాటుకు గురైే ప్రాంతాలు తెలుసుకునేలా సెన్సార్ అబ్జర్వేషన్‌ను అభివృద్ధి చేశాం. – విమలామృత, 9వ తరగతి, కేజీబీవీ, పెద్దవడుగూరు

ఫేస్‌మాస్క్ శుభ్రపరిచే పరికరం



ఒకసారి వినియోగించిన మాస్క్‌ను బయటపడేయకుండా రీసైక్లింగ్ చేసి మళ్లీ ఉపయోగించుకుంటే ఎలా ఉంటుందనే నా ఆలోచనకు మా గైడ్ టీచర్ ఎం.సరస్వతి రూపం కల్పించారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఫేస్ మాస్క్ వినియోగం ఎంతో అవసరమైంది. ఈ క్రమంలో ఒకసారి వినియోగించిన మాస్క్‌ను మేము చేసిన డిస్ ఇన్‌ఫెక్షన్ బాక్స్‌లో ఉంచి తీస్తే పూర్తి స్థాయిలో శుభ్రమవుతుంది. ఇది ఎంతో సురక్షితమైందని మా పరిశోధనల్లో తేలింది. అంతేకాక ఈ బాక్స్ తయారీకి బడ్జెట్ కూడా తక్కువే.
– ఎల్.విద్య, పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్, బొమ్మనహాళ్

ఎకో బ్రిక్స్‌తో భవిత పదిలం



మా గైడ్ టీచర్ కె.రామలక్ష్మి సాయంతో ఎకో బ్రిక్స్ తయారీ విధానాన్ని కనుగొన్నా. సాధారణంగా ఇటుకల తయారీకి మట్టి లేదా సిమెంట్ వాడుతుంటారు. వీటి తయారీకి వినియోగించే ముడిసరుకు ధర ఎక్కువ. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇటుక చేస్తే ఎలా ఉంటుందనే నా ఆలోచనను మా టీచర్ రామలక్ష్మికి తెలిపాను. వెంటనే ఆమె నన్ను పోత్సహించారు. పలు దశల ప్రయోగాల అనంతరం చివరకు సక్సెస్ అయ్యాం. ప్లాస్టిక్ వ్యర్థాలను కరిగించి సిమెంట్‌తో మిశ్రమం చేయడం ద్వారా అతి తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన, దృఢమైన ఇటుకను తయారు చేయగలిగాం. ఇది సాధారణ మట్టి, సిమెంట్ ఇటుకల కంటే ఎక్కువ కాలం మన్నికనిస్తుందని మా ప్రయోగాల ద్వారా స్పష్టమైంది.
– వి.శిల్ప, పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్, గడేకల్లు

న్యూస్‌ప్రింట్‌నూ వినియోగించవచ్చు



న్యూస్ ప్రింట్ (న్యూస్ పేపర్)ను ఒకసారి వినియోగిస్తే తిరిగి వాడడానికి వీలుండదు. అయితే దీనిని తిరిగి ఏడు దఫాలు వాడేందుకు వీలుగా సరికొత్త విధానాన్ని ఆవిష్కరించాం. వృథాగా పడేస్తున్న పేపర్‌ను రోజంతా నీటిలో నానబెట్టి రుబ్బి.. వైర్ స్క్రీన్ సాయంతో ఆ గుజ్జును ఎండబెట్టడం ద్వారా తిరిగి పేపర్‌ను పొందవచ్చు.
– కేఆర్ విజయలక్ష్మి, గైడ్ టీచర్, జెడ్పీహెచ్ఎస్, శింగనమల

బైక్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... శనివారం అనంతపురంలో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాలరెడ్డికి చెందిన ఎన్నికల ప్రచార సామగ్రి తీసుకుని ఆయన కుమారుడు సాయి శ్రీనివాసరెడ్డి కారులో కళ్యాణదుర్గం బయలుదేరాడు. బోరంపల్లి దాటిన తర్వాత కారు డ్రైవర్ రాజారెడ్డి అతి వేగం, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ ఎదురుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న గోళ్ల గ్రామానికి చెందిన ఖాదర్‌ను ఢీకొన్నాడు. ఘటన చోటు చేసుకున్న వెంటనే రాజారెడ్డి పూర్తిగా నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లో బోల్తాపడింది. ఖాదర్‌కు నడుం, తలకు తీవ్ర గాయాలయ్యాయి. రాజారెడ్డితో పాటు సాయి శ్రీనివాసరెడ్డి గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న అనిల్ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ సుధాకర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పొలాల్లో చెల్లాచెదురుగా పడి ఉన్న ఎన్నికల ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.





ప్రమాదానికి కారణమైన కారు (ఇన్‌సెట్‌లో) గాయపడ్డ ఖాదర్

ఎన్నికల నిర్వహణకు నోడల్ వ్యవస్థ ఏర్పాటు

- 27 మందికి 22 పనుల బాధ్యత అప్పగింత
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజకవర్గంతో పాటు స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎన్నికల ప్రక్రియలో చేపట్టాల్సిన 22 పనులను గుర్తించడంతో పాటు ఆయా పనుల నిర్వహణకు 27 మంది నోడల్ అధికారులను నియమించి బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నోడల్ అధికారులు వీరే..

పేరు,	హోదా	బాధ్యతలు
ఫక్కీరప్ప కాగినెల్లి	ఎస్పీ	లా అండ్ ఆర్డర్, వీఎం అండ్ సెక్యూరిటీ ప్లాన్
కె.విజయలక్ష్మి	ఏఓ, కలెక్టరేట్	మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్
సరళ విజయకుమారి	డీడీ, ఖజానా శాఖ	
రవికుమార్	డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్	
కె.ఎల్.ప్రభాకరరావు	జిల్లా పంచాయతీ అధికారి	బ్యాలెట్ పేపర్ మేనేజ్‌మెంట్
జి.శ్రీనివాసులు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	
ఎన్.శివరామప్రసాద్	డిప్యూటీ కమిషనర్, ట్రాన్స్‌పోర్ట్	ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్
ఐ.నరసింహారెడ్డి	పీడీ, డీఆర్‌డీఏ	ట్రైనింగ్ మేనేజ్‌మెంట్
విజయలక్ష్మి	పీడీ, మెప్మా	మెటీరియల్ మేనేజ్‌మెంట్
రవికుమార్	డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్	కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ
పి.కేశవనాయుడు	సీఈఓ, ఆన్‌సెట్	ఎస్‌వీఈఈపీ కార్యకలాపాలు
సి.హెచ్.ప్రేమ్‌చంద్	సీపీఓ	బ్యాలెట్ బాక్స్ ప్రొక్యూర్మెంట్
ఎన్.వెంకటేశ్వర్లు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్
ఎం.ప్రభాకర్‌రెడ్డి	జిల్లా కో-ఆపరేటివ్ అధికారి	ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్
రమేష్	డీపీఆర్ఓ, ఐఅండ్‌పీఆర్	ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా
తిప్పేస్వామి	డీడీ, భూగర్భజలశాఖ	కమ్యూనికేషన్ ప్లాన్
ఖుష్బూ కొఠారి	డీడీ, బీసీ వెల్ఫేర్	ఎలక్టోరల్ రోల్స్
సి.హెచ్.ప్రేమ్‌చంద్	సీపీఓ	ఫిర్యాదులు, పరిష్కారం ఓటర్ హెల్ప్‌లైన్
శంకరరావు	ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు	పనుల తీరు పరిశీలన
భాగ్యరాజ్	ఎస్ఈ, పంచాయతీరాజ్	స్ట్రాంగ్‌రూమ్ అండ్ కౌంటింగ్ సెంటర్స్
జి.శంకరయ్య	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	కౌంటింగ్ అరేంజ్‌మెంట్స్
జి.నాగేశ్వరరెడ్డి	టూరిజం అధికారి	
ఎన్.వెంకటరాముడు	డీఎం	ఏపీఎస్‌సీఎస్‌సీ
శోభారాణి	డీఎస్ఓ	రిఫ్రెష్‌మెంట్ ఏర్పాట్లు
జి.నాగరాజారావు	జిల్లా పరిశ్రమల అధికారి	మైక్రో అబ్జర్వర్స్ (సూక్ష్మ పరిశీలకులు)
ఎన్.వేణుగోపాలరెడ్డి	పీడీ, డ్వామా	వెబ్‌కాస్టింగ్, ప్రొవిజన్ ఆఫ్ ఇంటర్నెట్
ఎస్.మహమ్మద్‌రఫీ	జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి	రిజర్వ్
ప్రభాకరరావు	ఈడీ ఎస్సీ కార్పొరేషన్	
ఎం.అన్నాదొర	గిరిజన సంక్షేమ అధికారి	

క్లుప్తంగా

13 నుంచి సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు

అనంతపురం టవర్‌క్లాక్: గుత్తి మండలంలోని చర్లోపల్లిలో ఉన్న సేవాఘడ్‌లో ఈ నెల 13,14, 15 తేదీల్లో నిర్వహించనున్న సంత్‌సేవాలాల్ మహరాజ్ 284వ జయంత్యుత్సవాలు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యాశంకర్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రోడ్లు భవనాలశాఖ అతిథి గృహంలో ఉత్సవాల పోస్టర్లు విడుదల చేశారు. వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ బంజారాలలా ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, సాకే ఆనంద్, గోవ్రే నాయక్, గణేష్ నాయక్ పాల్గొన్నారు.

నరేష్ ఆశయాలు కొనసాగిస్తాం

అనంతపురం: ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేష్ ఆశయాలను సాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పరమేష్ అన్నారు. అనంతపురం నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు నరేష్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.2012 ఫిబ్రవరి 10న రోడ్డు ప్రమాదంలో నరేష్ మృతి చెందాడు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో నరేష్ ఎప్పుడూ ముందు ఉండేవాడని విద్యార్థి నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, కిరణ్, అనిల్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తరఫున బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న ప్రజాప్రతినిధులు

కనగానపల్లి (రామగిరి): రామగిరి మండలంలోని పెద్ద కొండాపురం, రెడ్డివారిపల్లి, మక్కినవారిపల్లి గ్రామాల్లోని బాధితులు సిద్దక్క, అంజినమ్మ, బాబు, జ్యోతి, అక్కమ్మ, ఓబులేసు కుటుంబాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. పెద్దకొండాపురం పంచాయతీలో ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు కొందరు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు శనివారం రూ.3లక్షలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయ కరెన్న, జెడ్పీటీసీ సభ్యుడు నాగార్జున, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, మాజీ ఎంపీపీ సుజాత భర్త ఆదిరెడ్డి, సర్పంచ్‌లు రామ్మూర్తి, రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ప్రశాంతినగర్‌లో ఆక్రమణలు తొలగించిన దృశ్యం

అనంతపురం క్రైం: కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో ప్రశాంతినగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఇటీవల 'సాక్షి'లో 'ఆక్రమణలకు పక్కా ప్రణాళిక' శీర్షికన కథనం ప్రచురితమైంది. శనివారం కమిషనర్ స్పందించారు. పట్టణ ప్రణాళిక కార్యదర్శి శ్యామ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రెండు వరుసల్లో చిన్నపాటి గోడలను తొలగించారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

- షెడ్ల పేరుతో వ్యాపారాల నిర్వహణ
- భవన నిర్మాణ ఫీజులు చెల్లించకుండా వ్యాపారాలు
- నగరపాలక సంస్థకు రూ.కోట్లలో నష్టం
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

అనంతపురం క్రైం: టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యంతో నగరపాలక సంస్థకు భారీగా గండిపడుతోంది. షెడ్ల పేరుతో రూ.కోట్లలో వ్యాపారాలు చేస్తున్నారు. దీనికి కొందరు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. స్లాబ్ వేయకుండా సిమెంట్ బ్రిక్స్‌తో (8 నుంచి 20 సెంట్లలో) షెడ్లు నిర్మించి, అందులో డయాగ్నస్టిక్ సెంటర్లు, జిమ్ములు, రెస్టారెంట్లు, ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు, గ్రానైట్ షాపులు, టీ కేఫ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయినా పట్టణప్రణాళిక అధికారులు అటువైపు కూడా కన్నెత్తిచూడలేదు.

టెంపరరీ షెడ్లలో పెద్ద వ్యాపారాలు:

- శ్రీకంఠం సర్కిల్ పారడైజ్‌కు ఆనుకొని ఉన్న వీధి ప్రారంభంలో భారీగా షెడ్లలో బిరియానీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవు.
- నగరంలో విద్యుత్‌నగర్ నుంచి జేఎన్‌టీయూకు వెళ్లే మార్గంలో అడుగడుగునా షెడ్లు కన్పిస్తాయి. హోటళ్లు, గ్రానైట్ షాపులు, ఎలక్ట్రిక్ వాహనాలు, తదితర వ్యాపారాలు భారీగా నిర్వహిస్తున్నారు.
- నీరు– ప్రగతి వనం సర్కిల్ (శ్రీనగర్‌కాలనీ)లో ఓ జిమ్ ఎదురుగా కూడా భారీ స్థాయిలో షెడ్డును ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇందులోనూ పెద్ద వ్యాపారాలు చేసేందుకు నిర్మాణదారులు సిద్ధమయ్యారు. ఇలా వ్యాపారాలు చేస్తూ భారీగా ఆదాయం సంపాదించేందుకు కొత్త ట్రెండ్‌కు తెరలేపారు. పేరుకుమాత్రం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకొని రూ.లక్షల్లో ఆదాయం ఆర్జించేస్తున్నారు. వాస్తవంగా ఇలాంటి షెడ్లు వేసుకున్న వారు మొదటగా నగరపాలక సంస్థ అనుమతులు తీసుకోవాలి. ఖాళీ జాగా పన్ను (వేకెండ్ ల్యాండ్ ట్యాక్స్)తో పాటు సాధారణంగా భవనాలను చెల్లించే ఫీజులనే చెల్లించాల్సి ఉంటుంది. కొందరైతే టౌన్ ప్లానింగ్ అధికారులతో లోపాయికార ఒప్పందాలు చేసుకుని ఖాళీ జాగా పన్ను కూడా చెల్లించడం లేదు. అలాంటి నగరంలో 20 నుంచి 50 వరకు ఉన్నట్లు సమాచారం. ఈ విధంగా చేస్తే నగరపాలక సంస్థకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. కానీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంగా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం గండిపడుతోంది. నగరంలో వందల సంఖ్యల్లో టెంపరరీ షెడ్లలో జోరుగా వ్యాపారాలు జరుగుతున్నాయి.



పై ఫొటో నగరంలోని వేణుగోపాల్ నగర్‌లోనిది. 8 సెంట్లలో సిమెంట్ పెళ్లలతో ఓ ఆస్పత్రి నిర్మాణం చేస్తున్నారు. ఎలాంటి నగరపాలక సంస్థ అనుమతులు తీసుకోలేదు.



ఈ ఫొటో నగరంలోని ఎస్‌వీ థియేటర్‌కు పక్కనున్న వీధిలోనిది. రోడ్డును ఆక్రమించి చికెన్ కార్నర్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

చార్జ్‌షీట్ ఫైల్ చేస్తాం

నగరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా నగరపాలక సంస్థ అనుమతి తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకునే వారిపై చర్యలు తీసుకుంటాం. ఆ నిర్మాణాలపై చార్జ్‌షీట్ దాఖలు చేస్తాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– కే భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్

వైఎస్సార్‌సీపీతోనే సముచిత స్థానం

- నగర మేయర్ మహమ్మద్ వసీం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ వసీం, మైనార్టీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్‌సీపీతోనే ముస్లింలకు సముచిత స్థానం లభించిందని నగర మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి మేయర్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు కళ్యాణమస్తు, షాదీతోఫా ద్వారా పేద కుటుంబాలకు సీఎం అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజల్లో ఈ ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా కల్పించారు :

జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వివాహాలకు 308 మందికి రూ. 2.5 కోట్లను మంజూరు చేశారని మేయర్ అన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం ప్రత్యేకంగా రాష్ట్రం నుంచే వెళ్లేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి తొలిసారిగా చొరవతో విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు అవకాశం కల్పించారన్నారు. మార్చి 10లోపు హజ్ యాత్రకు వెళ్లే వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పాస్‌పోర్ట్ తప్పనిసరిగా డిసెంబర్ 31, 2023 చెల్లుబాటయ్యే వారు మాత్రమే అర్హులన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాజా, సభ్యులు ఖమర్‌తాజ్, కార్పొరేటర్లు ఇసాక్, లాలుసాబ్, రహంతుల్లా, తరిమెల అబూసాలెహ, బాబాఫక్రుద్దీన్, హసీనాబేగం, కోఆప్షన్ సభ్యుడు షంషొద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మునీరాబేగం, ఏ1 రఫి, బషీర్ అహమ్మద్, ఖాదర్, గఫార్, రియాజ్, కువైట్ ఖాదర్‌బాషా, షరీఫ్‌ఖాన్, దాదాఖలందర్, ఖాజా, మదార్ పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం

అనంతపురం సెంట్రల్: నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ శాఖ ఉద్యోగులకు ఏపీ పవర్(ట్రాన్స్‌కో) డిప్లమో ఇంజనీర్స్ అసోషియేషన్ రాష్ట్ర ఉప ముఖ్య కార్యదర్శి బీకే మిశ్రా పిలుపునిచ్చారు. యూనియన్ కడప జోన్ సమావేశం శనివారం అనంతపురంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ట్రాన్స్‌కో అతిథిగృహంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా మిశ్రా హాజరై, మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆరా తీశారు. సమస్యలేవైనా యూనియన్ దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కడప జోనల్ ప్రెసిడెంట్ షరీఫ్‌మియా, సెక్రటరీ వీరాంజనేయులు, అనంతపురం సర్కిల్ ప్రెసిడెంట్ రామలింగప్ప, సెక్రటరీ నిరంజన్, ట్రెజరర్ మహబూబ్‌బాషా, నాలుగు జిల్లాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



చంద్రకాంత్‌ను సత్కరిస్తున్న గాయనీ గాయకులు

- ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగేహరిత

అనంతపురం కల్చరల్: సంగీతామృతాన్ని పంచిన అమరగాయకుడు ఘంటసాల సంగీతం, గానం అజరామరమని ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత అన్నారు. అమర గాయకుడు ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ సురభి కళాకారులు రాయలసీమలోనే తొలిసారి అనంత వేదికగా 'ఘంటసాల నాటకం' ప్రదర్శించారు. శనివారం రాత్రి స్థానిక లలితకళా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో రాగే హరితతో పాటు నాటక రచయిత, దర్శకుడు భాస్కరుని సత్యజగదీష్, ఎల్కేపి అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, పాలసముద్రం నాగరాజు, భూపతి రామాంజనేయులు, బృందామూర్తి డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు.

కంట తడిపెట్టించిన 'ఘంటసాల జీవితం' :

సురభి కళాకారులు విన్నూత్న ప్రయోగంగా గానగంధ్వరుడు ఘంటసాల జీవితాన్ని నాటకంగా మలచి ప్రదర్శించిన తీర ఆకట్టుకుంది. ఆస్పత్రిలో ఉంటూ కూడా భగవద్గీతను ఆలపించే సన్నివేశంలో ఘంటసాల పాత్రధారి ఇంద్రకుమార్ తన నటనతో కంట తడి పెట్టించారు. కళాకారులందరూ ఆయన జీవితాన్ని కళ్లకు కట్టినట్లు నటించి ప్రశంసలందుకున్నారు.

ఆకట్టుకున్న ఆ పాత మధురాలు

అలనాటి మధురగీతాలను అనంత గాయనీ గాయకులు అద్భుతంగా ఆలపించి మైమరపించారు. శనివారం ఉదయం స్థానిక మూడోరోడ్డులోని ఘంటసాల భవన్‌లో ఘంటసాల వర్ధంతి సందర్భంగా సంగీత కచేరీ జరిగింది. ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకులు పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో గాయకులు ఆ పాత మధురాలను ఆలపించారు. తెలంగాణాకు చెందిన ప్రముఖ గాయకుడు చంద్రకాంత్ పాత సినిమాల్లోని ఘంటసాల పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. అనంతరం చంద్రకాంత్‌ను సన్మానించారు. అంతకు ముందు ఇటీవల మరణించిన విజయ్‌కుమార్, వాణీజయరామ్, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు సంతాపం ప్రకటించారు.

ఆహూతులను మైమరిపించిన గాయకులు :

పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక ఆఫీసర్స్‌క్లబ్ ప్రాంగణంలో ఘంటసాల విభావరి ఘనంగా జరిగింది. నిర్వాహకుడు సురేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత గాయకులు చంద్రకాంత్ విశిష్ట అతిథిగా హాజరై 'ఘంటసాల అవార్డు' అందుకున్నారు. డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఆర్డీటీ ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, రవికాంత్ రమణ, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు, వివిధ కళాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవం.. సుబ్రహ్మణ్యేశ్వరుడి గ్రామోత్సవం

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామికి ఏకవార రుద్రాభిషేకం, సహ స్రనామార్చన వంటి కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు రామాచార్యులు నిర్వహించారు. స్వామి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండి విగ్రహాలను రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకీలో ఉంచి, గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు భజనలు, మేళతాళాల మధ్య స్వామిని ఆయన సన్నిధికి చేర్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గ్రామోత్సవాన్ని తిలకించారు. అనంతరం కొండల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు, ఎస్ఐ సాగర్ పర్యవేక్షించారు.

వైభవంగా మహాశివుడి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఆలయ అధికారులు

అనంతపురం కల్చరల్ : నగరంలోని మొదటిరోడ్డులో కొలువైన కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శని వారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ధ్వజస్తంభ ప్రతిష్టతో ఉత్సవాలకు ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి అంకురార్పణ చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజలు మహాన్యాసం, ఏకవార రుద్రాభిషేకం, దీక్షాహోమం వరకు సాగాయి. మహామంగళ హారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

కనులపండువగా ఊరేగింపు : సాయంత్రం ప్రదోష కాల పూజల అనంతరం వాహన సేవలు కనుల పండువగా సాగాయి. స్థానిక మొదటిరోడ్డు నుంచి రెండోరోడ్డు, మూడోరోడ్డు మీదుగా ఆలయానికి చేరుకున్న నగరోత్సవంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రాచీన కళారూపాలను హృద్యంగా ప్రదర్శించారు. కోలాటం కళాకారులు భక్తిగీతాలపై అభినయించిన తీరు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధారాణి, నగరపాలక స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లక్ష్మిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు శనివారం ముగిసాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 23 నుంచి తిరుపతిలో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో రాప్తాడు జట్టు విజేతగా నిలిచింది. హిందూపురం జట్టు రన్నరప్‌ను దక్కించుకుంది. అలాగే అశోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో అనంతపురం జట్టు విజయం సాధించింది. బుక్కరాయసముద్రం జట్టు రన్నరప్‌ను దక్కించుకుంది. కబడ్డీ విజేతగా అనంతపురం జట్టు, రన్నర్స్‌గా ధర్మవరం జట్టు నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో పురుషులుః గణేష్, రాహుల్, రాజు, హర్ష, సంజయ్, మహిళల విభాగంలో తన్మయి, జాహ్నవి, విద్యశ్రీ విజేతలుగా నిలిచారు. అలాగే టేబుల్ టెన్నిస్ పురుషుల విభాగంలో కుశాల్‌కుమార్, అచ్యుత్‌రెడ్డి, వంశీకృష్ణ, మహిళల విభాగంలో షగుఫ్తా ఆఫ్రీన్, ప్రత్యూష విజయం సాధించారు. కాగా, పోటీల ముగింపు కార్యక్రమానికి ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి, వెంకటరమణ, పీడీలు కేశవమూర్తి, సిరాజ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండపై ప్రత్యేక పూజలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న దేవరకొండపై కొండమీద రాయుని ఆలయంలో స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

యువతను ప్రోత్సహించడం అభినందనీయం

అనంతపురం కల్చరల్: రాయలసీమలో లభ్యం కాని ఎన్నో కథలను సాహితీ లోకానికి అందిస్తున్న భాషా ప్రేమికులను గుర్తించి, అధికార భాషా సంఘంలో చేర్చడం అభినందనీయమని అనంత జిరసం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పతికి రమేష్ నారాయణ, అధ్యక్షుడు సాకే శ్రీహరిమూర్తి, ప్రధాన కార్యదర్శి తోట నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం 'అనంత జిరసం' కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగు అధ్యాపకుడు, వైఎస్సార్ జిల్లావాసి తవ్వా వెంకటయ్యను అధికార భాషా సంఘం సభ్యుడిగా నియమించడంపై ప్రభుత్వానికి భాషా ప్రచారం పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు.

సంత ద్వారా వచ్చిన ఆదాయం రూ.1.78 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,77,940 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్దచర్మ వ్యాధి (లంపీస్కిన్ డిసీసెస్) కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గతేడాది సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్ యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో థ్యాంక్స్ గివింగ్ ప్రేయర్స్



ప్రార్థనల్లో పాల్గొన్న జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షులు, సభ్యులు

అనంతపురం కల్చరల్: జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం థ్యాంక్స్ గివింగ్ ప్రేయర్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నెహమ్యా నాగరాజు నేతృత్వంలో తొలుత సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన బైబిల్ మిషన్ ఏవో దైవజనులు బందెల రాజు వాక్యోపదేశం చేశారు. అనంతరం పాస్టర్ రూఫస్‌కు మందుల నిమిత్తం రూ.6 వేలు అందించారు. కార్యక్రమంలో రెవరెండ్ మార్క్, ఆనంద్, రెవరెండ్‌మనుష్యే, జీవన్‌బాబు, సత్యసాయి జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ సేవలు అభినందనీయం



లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీవో మధుసూదన్

అనంతపురం కల్చరల్: దశాబ్దాలుగా ఇస్కాన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. శ్రీశైలం అటవీ ప్రాంతాల్లో మహాశివ రాత్రి సందర్భంగా నడిచివెళ్లే భక్తులకు అవసరమైన నిత్యావసర వస్తువులు, కూరగాయల లారీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. శనివారం ఇస్కాన్ గోశాలలో దామోదర్ గౌరంగదాసు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాదయాత్ర ద్వారా మల్లికార్జున, భ్రమరాంబమాతను దర్శించుకోవడానికి వెళ్లే భక్తులకు రెండు లక్షల మందికి పైగా అన్న వితరణ చేయడానికి ఇస్కాన్ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఆర్డీవోను శ్రీవేంకటేశ్వరాలయంలో స్వామి వారి వస్త్రాలను అందించి, సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

కౌన్సిల్ సమావేశం వాయిదా

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో ఈ నెల 13న జరగాల్సిన కౌన్సిల్ సమావేశం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్లు తెలిసింది. సమావేశం జరగాల్సిన బడ్జెట్ సమావేశం కూడా ఎన్నికల కోడ్ ముగిశాక కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉంది.

నేడు కవితాగానం

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని రూమ్ నం.8లో శ్రీశ్రీ మహాప్రస్థానం కవితలను కవులు చదివి వినిపిస్తారని నిర్వాహకురాలు డాక్టర్ ప్రగతి ఓ ప్రకటనలో తెలిపారు. సాహితీస్రవంతి, ప్రజాశక్తి బుక్‌హౌస్ సంయుక్తంగా 'రెడ్ బుక్స్ డే' వేడుకలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు కవితాగానం ఉంటుందన్నారు. కార్యక్రమానికి సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ఆత్మీయ అతిథిగా రానున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తకు గాయాలు

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. రాప్తాడు మండలం గొండిరెడ్డిపల్లికి చెందిన జాఫర్, అతని భార్య షకీనా ద్విచక్ర వాహనంపై ధర్మవరం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ముక్తాపురం వద్దకు రాగానే వాహనం నుంచి అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారి ఇద్దరినీ హైవే పెట్రోలింగ్ వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో ట్రాన్స్‌కో లైన్‌మెన్‌కు గాయాలు

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లిలో తేనెటీగల దాడిలో ట్రాన్స్‌కో లైన్‌మెన్ నారాయణ రెడ్డి శనివారం గాయపడ్డాడు. వివరాలు..నారాయణ రెడ్డి కళ్యాణదుర్గంలోని సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. వ్యవసాయ తోటలో నారాయణ రెడ్డి నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి విధులకు వెళ్లి, ఉదయం ఇంటికి వచ్చిన నారాయణరెడ్డి.. వ్యవసాయతోటలోని చింతచెట్టు కింద కూర్చున్నాడు. ఒక్క సారిగా తేనెటీగలు దాడి చేశాయి. వాటిని తప్పించుకొని పక్కనే ఉన్న నీటి తొట్టిలో మునిగినా వదలకుండా దాడి చేశాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నారాయణ రెడ్డి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.